# బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 03 ఆగస్టు 2024 | www.balagamtv.com | పేజీలు 4


## హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ స్టేడియం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ నగరంలో మరో అంతర్జాతీయ స్టేడియాన్ని నిర్మిస్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం తీసుకోబోయే చర్యలను సీఎం రేవంత్ వివరించారు. ఇందులో భాగంగా త్వరలో నూతన క్రీడా విధానం తేబోతున్నట్లు ఆయన ప్రకటించారు. ! స్పోర్ట్స్ పాలసీకి హర్యానా క్రీడా విధానం పరిశీలిస్తున్నామని రేవంత్ తెలిపారు. అంతేగాక, హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ స్టేడియం నిర్మిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీ సమీపంలో బ్యాగరికంచెలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బీసీసీఐతో చర్చించినట్లు సీఎం తెలిపారు. క్రీడల కోసం బడ్జెట్‌లో రూ.321 కోట్లు కేటాయించామన్నారు. స్పోర్ట్స్ పాలసీపై ఎవరు సలహాలు ఇచ్చినా స్వీకరిస్తామన్నారు.

భూముల లభ్యత చూసి మండల కేంద్రాల్లో స్టేడియాలు నిర్మిస్తామని సీఎం తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించిన బాక్సర్ నిఖత్ జరీన్‌కు ఆర్థిక సాయం చేసి ఇంటిస్థలం కేటాయించామని తెలిపారు. అలాగే క్రికెటర్‌సిరాజ్‌కు విద్యార్హత లేకున్నా గ్రూప్-1 ఉద్యోగం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. చదువులోనే కాదు, క్రీడల్లో రాణిస్తే కూడా ఉన్నత ఉద్యోగం వస్తుందని కుటుంబం గౌరవం పెరుగుతుందని చెప్పారు.

# గన్ పార్క్ వద్ద
# బీఆర్ఎస్ నేతల నిరసన







- పాల్గొన్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి
- అరెస్టు చేసిన పోలీసులు
- అశోక్‌నగర్ వచ్చి ప్రకటించిన జాబ్ క్యాలెండర్ కరెక్ట్ అని ఒక్కరితో చెప్పించు : కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద శుక్రవారం బీఆర్ఎస్ నేతలు నిరసన తెలిపారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేయడాన్ని నిరసిస్తూ అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.అయితే ఆందోళన విరమించాలని పోలీసులు కోరారు. అయినా కూడా వారు వినిపించుకోకపోవడంతో పోలీసులు పెద్దఎత్తున చేరుకుని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలను అరెస్ట్ చేసి తెలంగాణ భవన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ కేట మార్పు మార్పు అంటూ తెలంగాణ ప్రజలను ఎక్కువ రోజులు ఏమార్చలేరని అన్నారు. తప్పకుండా ప్రజలు తిరగబడే రోజు వస్తుందని హెచ్చరించారు. జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగాల సంఖ్య ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దమ్ముంటే అశోక్‌నగర్‌కు వచ్చి.. నువ్వు ఇచ్చిన జాబ్ క్యాలెండర్ కరెక్ట్ అని చెప్పమని రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. ఈ 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం ఇచ్చిందని అక్కడ ఉన్న నిరుద్యోగులతో చెప్పించాలన్నారు. అలా చేస్తే మేమందరం రాజీనామా చేస్తామని సవాలు విసిరారు. రెండు లక్షల ఉద్యోగాలు బోగస్ అని కేటీఆర్ అన్నారు. మీరిచ్చిన జాబ్ క్యాలెండర్ బోగస్ అని తెలుసు.. అయినా కూడా పిల్లల్లో ఉద్వేగాల్ని రెచ్చగొట్టేవిధంగా లేని ఒక వాతావరణం నిర్మాణం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మీ క్యాలెండర్ బోగస్.. అందులో ఉద్యోగాలే లేవు. అందులో తారీఖులు తప్ప ఏమీ లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్‌పై చర్చ పెట్టమంటే రాష్ట్ర ప్రభుత్వం పారిపోయిందని ఎద్దేవా చేశారు. సిగ్గులేకుండా మళ్లీ మా ఎమ్మెల్యేలను సాటి ఎమ్మెల్యేతో ఒక బజారు భాషలో తిట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి,

మిగితా 3వ పేజీలో

## ఢిల్లీ సివిల్స్ అభ్యర్థుల మృతి కేసుపై సీబీఐ విచారణకు హైకోర్టు ఆదేశం

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

దేశ రాజధాని ఢిల్లీలోని ఓల్డ్ రాజేందర్ నగర్‌లో రావూస్ కోచింగ్ సెంటర్‌లో వరదల కారణంగా ఇటీవల ముగ్గురు సివిల్ సర్వీస్ అభ్యర్థులు మరణించిన ఘటన దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఢిల్లీలోని కోచింగ్ సెంటర్‌లో సివిల్స్‌కు ప్రిపేరవుతున్న అభ్యర్థుల మృతి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఘటనపై సీబీఐ విచారణకు ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఈ ఘటన నేపథ్యంలో ఢిల్లీలోని కోచింగ్ సెంటర్ల పరిస్థితిపై అధికార యంత్రాంగం తనిఖీలు చేపట్టింది. అక్రమంగా బేస్‌మెంట్స్‌లో కొనసాగుతున్న కోచింగ్ సెంటర్లపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. కాగా, ఢిల్లీ లోని ఓల్డ్ రాజేందర్ నగర్ లో గల ఓ కోచింగ్ సెంటర్‌లోకి వరద నీరు ప్రవేశించి ముగ్గురు విద్యార్థులు మరణించిన విషయం తెలిసిందే.

రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో రావుస్ స్టడీ సర్కిల్ బేస్‌మెంట్‌లోకి ఒక్కసారిగా వరద నీరు చేరింది. ఈ సమయంలో బేస్‌మెంట్‌లో ఉన్న లైబ్రరీలో దాదాపు 18 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 15 మంది ఎలాగోలా బయటపడగా, ముగ్గురు మాత్రం నీటిలో మునిగిపోయారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఢిల్లీ అగ్నిమాపక శాఖ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వచ్చి వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.

## అసెంబ్లీ ఎన్నికలకు సన్నాహాలు

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన సన్నాహకాలను సమీక్షించేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకూ జమ్మూకశ్మీర్‌లో పర్యటించనుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, ఎస్ఎస్ సంధు ఇక్కడ పర్యటించనున్నారు.కమిషన్ తొలుత రాజకీయ పార్టీలతో సమావేశమవుతుంది. సీఈవో, ఎస్పీఎన్ఓ, సెంట్రల్ ఫోర్సెస్ కోఆర్డినేటర్‌తోనూ సమీక్షా సమావేశాలు జరుపుతుంది. చీఫ్ సెక్రటరీ, డీజీపీ, జిల్లా ఎన్నికల అధికారులు, అన్ని జిల్లాల సూపరింటెండెంట్స్ ఆఫ్ పోలీస్‌లతోనూ కమిషన్ సమావేశమై ఎన్నికల సన్నాహకాలను సమీక్షిస్తుంది. ఆగస్టు 10న జమ్మూలో కమిషన్ పర్యటించి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో సమీక్షా సమావేశం జరుపుతుంది. అనంతరం జమ్మూలో పాత్రికేయుల సమావేశంలో ఈసీ పాల్గొంటుంది.

కాగా, 2024 లోక్‌సభ ఎన్నికల ప్రకటనకు ముందు గత మార్చిలోనూ సీఈసీ రాజీవ్ కుమార్ జమ్మూకశ్మీర్‌లో పర్యటించారు. యూటీలో త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని జమ్మూకశ్మీర్ ప్రజలకు, రాజకీయ పార్టీలకు హామీ ఇచ్చారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో జమ్మూకశ్మీర్ ప్రజలు రికార్డు స్థాయిలో ఓటుహక్కును వినియోగించుకోవడంపై కూడా కమిషన్ సంతృప్తి వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన సెప్టెంబర్ 30వ తేదీ గడువు లోగా జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయనే సంకేతాలు సైతం ఈసీ ఇచ్చింది

# జాబ్ క్యాలెండర్ విడుదల



- ఏప్రిల్‌లో మరో డీఎస్సీ
- వచ్చే ఏడాది ఆగస్టులో పోలీసుల పరీక్షలు
- నిరుద్యోగుల ఆకాంక్షల మేరకే జాబ్ క్యాలెండర్
- తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌పై ప్రకటన చేశారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ... గత పదేళ్ల కాలంలో నోటిఫికేషన్ల జాప్యం, తరుచూ వాయిదాలు ఇబ్బందికరంగా మారాయన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఉద్యోగాల నియామక ప్రక్రియ గందరగోళంగా మారిందన్నారు. గతంలో రెండుసార్లు గ్రూప్-1 పరీక్ష రద్దయిందని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.ఇప్పటికే టీజీపీఎస్సీని

మిగితా 3వ పేజీలో

## ఖైరతాబాద్ వినాయకుడి విగ్రహ నమూనా విడుదల




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఖైరతాబాద్ గణేశుడి విగ్రహ నమూనా విడుదలైంది. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ శుక్రవారం సాయంత్రం ఆదిదేవుడి స్వరూపం నమూనాను విడుదల చేసింది. ఈసారి 'సప్తముఖ మహాశక్తి గణపతి'గా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఇక్కడ గణేశుడి ఉత్సవాలు ప్రారంభించి 70 సంవత్సరాలు అవుతున్నందున... దీనిని పురస్కరించుకొని 70 అడుగుల విగ్రహాన్ని సిద్ధం చేస్తున్నారు. శ్రీ సప్తముఖ మహా శక్తి గణపతిగా దర్శనమీయనున్న ఖైరతాబాద్ గణనాథుడికి కుడివైపున శ్రీనివాస కళ్యాణం, ఎడమ వైపున శివపార్వతుల కళ్యాణం ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేక ఆకర్షణగా అయోధ్య బాలరాముడి ప్రతిమను ఏర్పాటు చేయనున్నారు.

### దుశ్శాసన సభగా మారిన
# తెలంగాణ శాసనసభ

- ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు దక్కే గౌరవం ఇదేనా
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ శాసనసభ దుశ్శాసనసభగా మారిందని బీఆర్ఎస్‌ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. సభ్యసమాజం తలదించుకునే విధంగా శాసనసభలో వ్యవహారాలు నడుస్తున్నాయని విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగాల సంఖ్య ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేశారని హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దానం నాగేందర్ అసభ్య పదజాలంతో మాట్లాడటంపై ధ్వజమెత్తారు.

ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు దక్కే గౌరవం ఇదేనా అని హరీశ్ రావు ప్రశ్నించారు. నిన్న మహిళా శాసనసభ్యులను పట్టుకుని నోటితో ఉచ్ఛరించలేని భాషలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మాట్లాడారని గుర్తుచేశారు. నిన్న మహిళా ఎమ్మెల్యేలను అవమానపరిచారని ఇవాళ ఈ దేశంలోని మహిళా మూర్తులు, కన్నతల్లులను అవమానపరిచేలా శాసనసభలో సభ్యులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సభా నాయకుడే సభలో ఉండి ఈరకంగా బీఆర్ఎస్ పార్టీని, ఎమ్మెల్యేలను తిట్టించే ప్రయత్నం చేయడం ఏరకంగా సమంజసమని ప్రశ్నించారు.

అది మనుషులు మాట్లాడే భాష కాదు పశువులు మాట్లాడే భాష అని దానం నాగేందర్‌పై హరీశ్‌రావు మండిపడ్డారు . ఒక రౌడీ షీటర్లు బయట మాట్లాడే భాషను శాసనసభ్యుడు సభలో మాట్లాడటం తగునా అని ప్రశ్నించారు. దీనికి స్పీకర్ ఎందుకు మైక్ కట్ చేయరు? దీన్ని సభా నాయకుడు ఏరకంగా ఎంకరేజ్ చేస్తారని ప్రశ్నించారు. తాము ఎప్పుడైనా ప్రభుత్వాన్ని ఘాటుగా విమర్శిస్తే.. తప్పులు ఎత్తిచూపితే కొన్ని సెకన్లలోనే తమ మైకులు కట్‌అవుతున్నాయని చెప్పారు. కానీ ఆ సభ్యుడు మాత్రం నోటికొచ్చినట్లుగా కన్నతల్లులను అవమానపరిచేలా మాట్లాడినా ఎందుకు మైక్ కట్ చేయట్లేదని నిలదీశారు. అవసరమైతే శాసనసభ్యులను సభ నుంచి బహిష్కరిస్తామని నిన్న ముఖ్యమంత్రి అన్నారని గుర్తుచేశారు. ఇవాళ రౌడీ భాషను మాట్లాడిన ఈయన్ను బహిష్కరించకూడదా? అని నిలదీశారు. ఒక రౌడీ భాషను మాట్లాడుతుంటే, మాతృమూర్తులను అవమానిస్తుంటే స్పీకర్ మైక్ కట్ చేయడు.. సభానాయకుడు ఖండించడు.. పైగా ముసిముసి నవ్వులు నవ్వుతుంటాడని మండిపడ్డారు. నిజంగా మీకు మాతృమూర్తుల మీద, మహిళల మీద గౌరవం ఉంటే తక్షణమే ఆ శాసనసభ్యుడిని బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఇదేమీ రాజ్యమో అర్థం అవ్వట్లేదని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. నిన్న మహిళా ఎమ్మెల్యేలను అవమానపరిచారని.. ఇవాళ మాతృమూర్తులను అవమానపరిచారని అన్నారు. మాతృత్వ విలువ తెలియని వాళ్లే ఈ రకంగా మాట్లాడతారని మండిపడ్డారు. ఇది మంచి పద్ధతి కాదని.. ఇప్పటికైనా ఆ సభ్యుడిని ఎక్స్‌పెల్ చేయాలని డిమాండ్ చేశారు. తల్లులు, మహిళల గురించి ఈరకంగా మాట్లాడుతుంటే కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

సభను నడిపే తీరు ఇదేనా.. మన పిల్లలకు

మిగితా 3వ పేజీలో

# బూతులతో రెచ్చిపోయిన దానం

- ఖండించిన మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ
- క్షమాపణలు చెప్పిన దానం నాగేందర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ దురుసు ప్రవర్తన చూపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై బూతులతో రెచ్చిపోయారు. మిమ్మల్ని బయట తిరగనివ్వా అంటూ స్పీకర్ ముందే వార్నింగ్‌లు ఇచ్చారు. అయితే దానం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యులతో పాటు ఇతర శాసనసభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో దిగొచ్చి క్షమాపణలు చెప్పారు.

హైదరాబాద్ నగర అభివృద్ధి కార్యక్రమాలపై సభలో శుక్రవారం స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ చర్చను ప్రారంభించిన దానం నాగేందర్.. బీఆర్ఎస్ సభ్యులను పరుష పదజాలంతో దూషించారు. ' హే మూసుకోవోయ్.. నీ..... బయటకూడా తిరగనియ్య కొడకా మిమ్మల్ని.. ఏమనుకుంటున్నారా మీరు నీ ..... తోలుతీస్తా ఒక్కొక్కడిది.. అరేయ్' నస్త్రఓజూ స్పీకర్ ముందే బెదిరింపులకు దిగారు. దానం నాగేందర్ బూతులు మాట్లాడటంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మండిపడ్డారు. ఈ క్రమంలోనే మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ కూడా దానం నాగేందర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అమ్మ అని మాట్లాడటం కరెక్ట్ కాదని హితవు పలికారు. సభలో ఎవరూ నోరు జారవద్దు.. సహనంతో ఉండాలని సూచించారు. జనాలకు రాంగ్ మెసేజ్ వెళ్తుందని.. ఆ వ్యాఖ్యలపై దానం నాగేందర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

శాసన సభ్యుల నుంచి తీవ్రమైన స్పందన రావడంతో దానం నాగేందర్... అమ్మ అనేది హైదరాబాద్‌లో తరచూ వాడుతుంటారని.. అది బూతు కాదని సమర్థించుకునే ప్రయత్నం చేశారు. అయితే మళ్లీ స్పీకర్ జోక్యం చేసుకోవడంతో దానం నాగేందర్ క్షమాపణలు చెప్పారు. ఎవరినైనా బాధ పెట్టి ఉంటే విచారం వ్యక్తం చేస్తున్నా అని అన్నారు.తానెప్పుడూ పరిధి దాటలేదని.. తన పనితీరు గురించి అందరికీ తెలుసని అన్నారు.

**రికార్డులు పరిశీలించి తొలగిస్తాం..**

దానం నాగేందర్ వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత రావడంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కూడా స్పందించారు. అసభ్య పదజాలం వాడివుంటే.. రికార్డులు పరిశీలించి తొలగిస్తామని స్పష్టం చేశారు. సభ్యులు తమ హక్కులను వినియోగించుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ సూచించారు.

# నాపై సోదాలకు సిద్ధమవుతున్న ఈడీ

- ఎంపీ రాహుల్ గాంధీ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనపై సోదాలకు సిద్ధమవుతోందని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ సంస్థలో పనిచేస్తున్న కొందరు విశ్వసనీయ వ్యక్తుల నుంచి తనకు ఈ సమాచారం అందిందని వెల్లడించారు. సాధారణంగానే ప్రతి ఇద్దరిలో ఒకరికి తన 'చక్రవ్యూహం' ప్రసంగం నచ్చలేదని రాహుల్ పేర్కొన్నారు. ఒకవేళ ఈడీ అధికా రులు సోదాలకు సిద్ధమైతే వారిని ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

కేంద్ర బడ్జెట్ 2024-25పై లోక్‌సభలో చర్చ సందర్భంగా సోమవారం ప్రసంగించిన రాహుల్ గాంధీ ఆరుగురు వ్యక్తులు దేశం మొత్తాన్ని పద్మవ్యూహంలోకి నెట్టివేస్తున్నారని ధ్వజమెత్తారు. మహాభారతంలోని కురుక్షేత్ర సంగ్రామంలో కీలక ఘట్టమైన పద్మవ్యూహాన్ని, వీరమరణం పొందిన అభిమన్యుడిని ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా, మరికొందరిపై రాహుల్? గాంధీ విమర్శలు సంధించారు. అభిమన్యుడిని చక్రవ్యూహంతో ఆరుగురు ఎలా హత్య చేశారో, ఇప్పుడు దేశాన్నీ అదే చేయబోతున్నారని వ్యాఖ్యానించారు.

యువత, రైతులు, మహిళలు, చిన్న, మధ్య తరహా వ్యాపారుల చుట్టూ, దేశంలోని ఆరుగురు వ్యక్తులు చక్రవ్యూహాన్ని పన్నుతున్నారని రాహుల్ ఆరోపించారు. రాజకీయ, వ్యాపార గుత్తాధిపత్యాన్ని మరింత బలోపేతం చేయడమే కేంద్ర బడ్జెట్ ముఖ్య ఉద్దేశమని రాహుల్ గాంధీ విమర్శించారు. దేశాన్ని బంధించిన చక్రవ్యూహం వెనుక మూడు శక్తులు ఉన్నాయన్నారు. దేశ సంపద మొత్తాన్ని కబళించాలని చూస్తున్న ఇద్దరు వ్యక్తులు మొదటి శక్తి కాగా, దర్యాప్తు సంస్థలైన ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ రెండోదని అన్నారు. రాజకీయ కార్యనిర్వాహక వర్గాన్ని మూడో శక్తిగా రాహుల్ అభివర్ణించారు. ఇవి దేశాన్ని విధ్వంసం చేస్తున్నాయని దుయ్యబట్టారు.

**వయనాడ్ ఘటన ఒక జాతీయ విపత్తు**

కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడి భారీ ఎత్తున ప్రాణ నష్టం సంభవించడం తనను ఎంతో బాధించిందని, కుటుంబ సభ్యులను, ఇళ్లను కోల్పోయిన వారి బాధ కలచివేస్తోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఇది జాతీయ విపత్తని ఆయన అభివర్ణించారు. వెంటనే సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పునర్నిర్మాణం చేపట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

# జిల్లాలో రూ. 244 కోట్ల 82 లక్షల రుణమాఫీ..

- రుణమాఫీ పూర్తి చేసి సంబంధిత రైతుల రెన్యువల్స్ పూర్తి చేయాలి..
- పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్ పకడ్బందీ చర్యలు..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

రూ. 2 లక్షల రుణమాఫీలో భాగంగా ప్రభుత్వం రెండు విడుతలలో లక్షన్నర వరకు ఉన్న రైతుల రుణాలను మాఫీ చేస్తూ నిధులు విడుదల చేశాయని, సిరిసిల్ల జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 35 వేల 676 మంది రైతులకు 244 కోట్ల 82 లక్షల రుణమాఫీ జరిగిందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో రైతు రుణమాఫీ, ఈడి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పాడి పశువుల యూనిట్ల ఏర్పాటు అంశాల పై బ్యాంకర్లతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ప్రభుత్వ రైతుల రుణాలు మాఫీ చేస్తూ నిధులు విడుదల చేసినందున, బ్యాంకర్లు రుణమాఫీ ఫలాలు సదరు రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని, రుణమాఫీ లబ్ధిదారులకు సంబంధించిన రుణాలు పూర్తి స్థాయిలో రెన్యూవల్ చేయాలని, ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు.జిల్లాలో ఇప్పటి వరకు 13, 207 రుణమాఫీ లబ్ధిదారులకు సంబంధించిన 84 కోట్ల 7 లక్షల రూపాయల రుణాల రెన్యూవల్ జరిగిందని , పెండింగ్ లో ఉన్న 22 ,469 మంది రైతులకు సంబంధించి 160 కోట్ల 75 లక్షల రుణాల రెన్యూవల్ ప్రక్రియ వేగవంతం చేయాలని, బ్యాంకుల్లో రుణమాఫీ రైతుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని అన్నారు.

రుణమాఫీ సంబంధించి రైతుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ కొరకు ప్రతి మండల కేంద్రంలో బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా గ్రీవియెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈడీ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2 వేల పాడి పశువుల యూనిట్లను 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు లింకేజ్ రుణాలతో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, మొదటి దశలో 619 యూనిట్ల పంపిణీ పరిపాలన అనుమతులు మంజూరు చేసిందని, ఇప్పటి వరకు 236 యూనిట్ల గ్రౌండ్ చేశామని అన్నారు.

ప్రతి పాడి పశువుల యూనిట్ క్రింద నిరు పేద ఎస్సి కుటుంబానికి జీవనోపాధి కల్పించేందుకు 2 పాడి పశువులను లక్షా 40 వేల రూపాయల సబ్సిడీ, 60 వేల బ్యాంకు లింకేజ్ తో పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. మొదటి దశలో ఎంపిక చేసిన లబ్ధిదారులు పాడి పశువులు తీసుకునేందుకు ఆసక్తి చూపని పక్షంలో మిగిలిన దరఖాస్తుదారుల జాబితా నుంచి అర్హులను ఎంపిక చేసి యూనిట్ గ్రౌండ్ చేయాలని అన్నారు.

మొదటి దశలో మంజూరు చేసిన పాడి పశువుల యూనిట్ల సబ్సిడి సోమ్ము ప్రభుత్వం విడుదల చేసిందని, ఎస్సి అధికారులు బ్యాంకర్లు సమన్వయంతో పని చేసి సంబంధిత లబ్ధిదారులచే పాడి పశువుల యూనిట్ త్వరగా గ్రౌండ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎస్సీ లబ్ధిదారులకు పాడి పశువులు పంపిణీ చేసిన తర్వాత కరీంనగర్ మిల్క్ డైరీ కి లింక్ చేయడం జరుగుతుందని , దీని ద్వారా రైతులకు మరో ఆధార మార్గం వచ్చి ఆర్థికంగా స్థిర పడతారని, దీనిని వెంటనే అమలు చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని అన్నారు.ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్, వివిధ బ్యాంక్ కంట్రోలర్స్, జెడ్పీ సిఈఓ. గీతా , ఎంపిడిఓ లు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మానందరిపై ఉన్నది

- జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ -10 విజయవంతం...
- ఎస్పీ అఖిల్ మహాజన్...



**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ -10 అన్ని శాఖల సహకారంతో విజయవంతం అయిందని ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం సంవత్సరంలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ అనే కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అందులో భాగంగా జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్-10 విజయవంతం కోసం పోలీస్ శాఖ,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ,లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, వివిధ డిపార్ట్మెంటుఅధికారులతో జిల్లాలో టీమ్ లుగా ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ సంవత్సరం జులై 1 నుండి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలో జిల్లా వ్యాప్తంగా 37 మంది పిల్లలని గుర్తించి వారి యొక్క తల్లిదండ్రుల వద్దకు చేర్చడం జరిగిందని, అందులో ఇద్దరు పిల్లలని బడిలో చేర్పించడం జరిగిందని,18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుని వారితో పని చేయిస్తున్న వారిపై 14 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.

బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మానందరిపైనా ఉన్నదని,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని,తరుచు బాలల చేత పనులు చేయిస్తున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.వీధి బాలలను చూసినప్పుడు, డయల్ 100 లేదా స్థానిక పోలీస్ వారికి సమాచారం అందించాలని సూచించారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం చేయడానికి సహకరించిన అన్ని శాఖల అధికారులను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

# వస్త్ర పరిశ్రమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు . సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ యజమానులు, ఆసాములతో శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని ఆడిటోరియంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు, ఆదేశాల మేరకు ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు పవర్ సబ్సిడీ కొనసాగించాలని పవర్ లూమ్ యజమానులు, ఆసాములు విజ్ఞప్తి చేశారు. గతంలో ఇచ్చిన విధంగా ఇవ్వాలని, ప్రభుత్వం నుంచి వస్త్ర పరిశ్రమకు ఆర్డర్లు ఇప్పించాలని కోరారు. అనంతరం సెస్ చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడారు. హైకోర్టు కేసు, ఆర్ఈసీ ఆదేశాల మేరకు 10 హెచ్ పీ వరకు సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. ఈ సమావేశం లో టెక్స్ టైల్స్ అండ్ హ్యాండ్లూమ్ ఏడీ సాగర్, సెస్ ఎండీ రవీందర్ రెడ్డి, డైరెక్టర్ దార్నం లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## నేతన్న బతుకులతో రాజకీయాలు వద్దు



- నేతన్నల సమస్య పరిష్కారానికి కృషి చేయాలి..

**బలగం టీవీ , సిరిసిల్ల**

ఎనిమిది మాసాల నుండి కార్మికులకు పని కోల్పోయి,ఇబ్బందులు పడుతుంటే స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ , కేంద్ర మంత్రి బండి సంజయ్‌లు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లకపోవడం సరి అయిన విధానం కాదు అని,నేతన్న బతుకులతో రాజకీయాలు చేయకుండా వారి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అఖిల భారత మహిళా సంఘం అధ్యక్ష,కార్యదర్శులు సురం పద్మ,జవ్వాజి విమల అన్నారు.సిరిసిల్ల పట్టణంలోని బీ వై నగర్ జండా చౌరస్తా లో అఖిలభారతమహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో నేతన్నల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణికి నిరసనగా బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి జవ్వాజివిమల మాట్లాడుతూ గత ఎనిమిది మాసాల నుండి సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో పదిమంది ఆత్మహత్యలు చేసుకున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అని అన్నారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తు, చర్చల ద్వారా కాలయాపన చేస్తున్నదని అన్నారు.

సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో సమస్య పరిష్కారం కొరకు మాట్లాడకుండా, గత ప్రభుత్వం ఉపాధి కల్పించినటువంటి బతుకమ్మ చీరలు సిరిసిల్లలో ఉత్పత్తి జరగలేదు అని, సూరత్ నుండి కిలోల చొప్పున కొనుక్కొచ్చి పంచారని మాట్లాడడం సిరిసిల్ల నేతన్నలను అవమానపరచడమే అని అన్నారు.ప్రతి సంవత్సరం నాలుగైదు నెలలు నిర్బంధంగా

బతుకమ్మ చీరలు ఉత్పత్తి చేయించడం మూలంగా, దాని ఫలితంగా ఇక్కడ గతంలో ఉన్నటువంటి ప్రవేట్ వస్త్ర మార్కెటు,ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లిందని,ఇప్పుడు మార్కెట్ లేకపోవడం కొత్త ఆర్డర్లు ప్రభుత్వం ఇవ్వకపోవడం, కరెంటు సబ్సిడీ తొలగించడం,కార్మికుల ఆసాముల కు సంబంధించిన గతంలో కొనసాగించినటువంటి స్కీ ములు రద్దు చేయడం వలన ఈ పరిస్థితి తయారైందని అన్నారు.నేతన్న బతుకులతో రాజకీయాలు చేయకుండా వారి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని,లేని పక్షంలో పెద్ద ఎత్తున మహిళలతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు ఈ సమావేశంలో బీవై నగర్ మహిళలు పాల్గొన్నారు.



## మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ హైద్రాబాద్ లోని సచివాలయం వద్ద శాంతియుత నిరసన తెలపడానికి బయలుదేరిన తంగళ్ళపల్లి మండల మాజీ సర్పంచ్ లను హైదరాబాద్ లో లిబర్టీ దగ్గర వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.అదుపులోకి తీసుకున్న మాజీ సర్పంచులను ఫలక్ నామ పోలిస్ స్టేషన్ కు తరలించారు.

## 76 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి

**బలగం టీవీ , హైదరాబాద్**

హైదరాబాద్‌లోని చార్మినార్ జోన్-6 పరిధిలో 76 మందికి పదోన్నతి కల్పించారు. ఈ మేరకు మల్టీ జోన్ 2 ఐజీపీవీ సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చార్మినార్ జోన్ 6 పరిధిలోని హైదరాబాద్, సైబరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని కానిస్టేబుళ్లకు పదోన్నతి కల్పించామని ఐజీపీవీ ఆ ఉత్తర్వుల్లో తెలిపారు. వీరందరూ సివిల్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారని వివరించారు.

## ప్రేమ వేధింపులు తాళలేక బాలిక ఆత్మహత్య

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఘటన

**బలగం టీవీ , హైదరాబాద్**

ప్రేమ పేరుతో యువకుడి వేధింపుల కారణంగా ఓ బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుషాయిగూడలో నివాసం ఉంటున్న దంపతులకు ముగ్గురు కుమార్తెలు. మొదటి అమ్మాయి వేరే జిల్లాలో తొమ్మిదో తరగతి వరకు చదివింది. చదువు మధ్యలోనే ఆపేసి ఇంట్లోనే ఉంటుంది. అదే ప్రాంతానికి చెందిన శివ అనే యువకుడు గత కొంతకాలంగా ఆ అమ్మాయిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. గత రాత్రి వేధింపులు ఎక్కువ కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో అమ్మాయి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోక్సో చట్టంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# దరఖాస్తుల ఆహ్వానం...

-అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**బలగం టీవీ ,సిరిసిల్ల:**

విపత్తు నిర్వహణలో సేవలు అందించిన వ్యక్తులు, సంస్థలు "సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్" వార్షిక జాతీయ విపత్తు పురస్కారానికి తెలంగాణ ప్రభుత్వ రెవెన్యూ (విపత్తు నిర్వహణ) శాఖ డిప్యూటీ సెక్రటరీ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అవార్డు కోసం దరఖాస్తులను పోర్టల్ https://awards.gov.inలి ఆన్‌లైన్‌లో నింపాలని, ఈ నెల 31వ తేదీ వరకు మీరు అందించిన సేవ దృశ్యాలను పైన తెలిపిన లింక్ లో అప్ లోడ్ చేయాలని సూచించారు.




# రైతులకు మాటిచ్చినం... నిలబెట్టుకున్నాం

**బలగం టివి ,తంగళ్ళపల్లి**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటను నెరవేర్చుకుందని మహిళా గవర్నర్ ను అవమానపరిచిన టిఆర్ఎస్ నేతలు మహిళా సాధకరిత గురించి టిఆర్ఎస్ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్నదాతలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని వెల్లడించారు. రైతులకు రెండో విడత రుణమాఫీ చేసినందుకు కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి చిత్రపటాలకు పాలభిషేకాలు చేశారు. ఈ ఈ కార్యక్రమంలో మండల కిసాన్ సెల్ అధ్యక్షులు పొన్నాల పరశురాములు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల భూపతి మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## 'అసెంబ్లీ సమావేశాలు ఇన్ని రోజులు జరగడం ప్రజాస్వామ్యానికి మంచిది'



**బలగం టీవి , హైదరాబాద్**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఇన్ని రోజులు జరగడం ప్రజాస్వామ్యానికి మంచిదని బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. గత పదేళ్లలో అసెంబ్లీ ఇలా జరగలేదని చెప్పారు. తమ పార్టీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి అసెంబ్లీలో బాగా మాట్లాడుతున్నారని ప్రశంసించారు. శుక్రవారం నాడు ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో అరవింద్ మీడియాతో మాట్లాడుతూ.. రాద్ధాంతం చేశారు కాబట్టే బీఆర్ఎస్ నేతలను అసెంబ్లీ నుంచి బయట పడేశారని చెప్పారు.ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బయటకు రాకుండా తన అన్న మాజీ మంత్రి కేటీఆర్ చూస్తున్నారని.. సీఎం రేవంత్ రెడ్డి అన్నారని గుర్తుచేశారు. తమ హైకమాండ్ కాళ్లు పట్టుకోవాల్సిన అవసరం ఏం లేదని తేల్చిచెప్పారు. 6 నెలల నుంచి కవిత జైల్లో ఉంది..రెండు కేసుల్లో అరెస్ట్ అయ్యిందని తెలిపారు. రేవంత్ రెడ్డిని గత ప్రభుత్వంలో చాలాసార్లు అరెస్ట్ చేశారు...కానీ గత ప్రభుత్వ అవినీతిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో రేవంత్ అధికారంలోకి వచ్చి 9 నెలలు అయ్యిందని చెప్పారు.

"కేంద్ర బడ్జెట్ గురించి రాజకీయ పార్టీలు ఏమంటున్నాయనేది అనవసరం. బడ్జెట్ దేశానికి మంచి చేసేలా ఉందని మేధావులు చెబుతున్నారు. తెలంగాణలో గడిచిన పదేళ్లలో రూ. 31 వేల కోట్ల రైల్వే పెట్టుబడులు పెట్టారు. తెలంగాణ బడ్జెట్‌లో మైనార్టీలకు బడ్జెట్ పెంచారు. ఎస్సీ, ఎస్టీలకు బడ్జెట్ తగ్గించారు. అధ్యక్ష పదవికి మా పార్టీలో రేసులు ఉండవు. నాకు ఇస్తా అంటే నన్ను పిలిచి మాట్లాడుతారు.. అప్పుడు నా సమాధానం పార్టీ అధిష్ఠానానికి చెబుతా. బీజేపీ అధ్యక్ష పదవి హిందు సామాజిక వర్గానికి ఇస్తే బావుంటుంది. భారత దేశంలో ఉండే ప్రతి ఒక్కరూ హిందువే. అధ్యక్ష పదవి ఎవరికి ఇవ్వాలనేది నా అభిప్రాయం అడిగితే పార్టీకి చెప్తా" అని అరవింద్ పేర్కొన్నారు.

# చిన్నారి ఆరోగ్యం పై బెంగ పెట్టుకోకుండ్రి.. అండగా ఉంటా..

- నయన శ్రీ వైద్యానికి అండగా నిలిచిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝ..
- మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు చర్యలు.
- చిన్నారి వైద్య ఖర్చులకోసం 10 లక్షల రూపాయల జమ..
- మానవత్వం చాటుకున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.



**బలగం టీవీ , సిరిసిల్ల :**

వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన గజ్జెల దిలీప్ శ్యామల దంపతుల చిన్న కూతురైన చిన్నారి నయన శ్రీ క్యాన్సర్ తో బాధ పడుతున్న నేపథ్యంలో ఆ చిన్నారి వైద్య చికిత్స కు సంపూర్ణ మద్దతు అందించేందుకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ముందుకు వచ్చి అండగా నిలిచారు. శుక్రవారం వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి నయన శ్రీ ఇంటిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సందర్శించారు. చిన్నారికి వచ్చిన క్యాన్సర్ వ్యాధి, చికిత్స నిమిత్తం ఇప్పటికే తల్లిదండ్రులు 3 లక్షల రూపాయలను అప్పుచేసి ఖర్చు చేశారని కలెక్టర్ తెలుసుకున్నారు. చిన్నారికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. వీర్నపల్లి మండల తహసిల్దార్, చిన్నారి తల్లి పేరు మీద జాయింట్ బ్యాంకు ఖాతా ప్రారంభించిన వెంటనే అందులో వైద్య ఖర్చుల నిమిత్తం 10 లక్షల రూపాయలు జమ చేయడం జరుగుతుందని తెలిపారు.



చిన్నారికి ఉన్న క్యాన్సర్ వ్యాధిని పూర్తిస్థాయిలో నయం చేసేందుకు మెరుగైన వైద్యం ఎక్కడ అందించాలనే అంశాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు . డీఎంహెచ్ఓ రిపోర్ట్ ప్రకారం చిన్నారి చికిత్స ప్రారంభించాలని, బ్యాంకు లో జమ చేసిన నిధులు చికిత్స కోసం వినియోగించాలని పేర్కొన్నారు.

చిన్నారి చికిత్స కోసం అవసరమైతే మరిన్ని నిధులను కూడా అందించడానికి సిద్ధంగా ఉన్నామని, తల్లిదండ్రులు ఎటువంటి బెంగ అవసరం లేదని, చిన్నారి వైద్య చికిత్స నిమిత్తం ఏ సమయంలో నైనా, ఎలాంటి సహాయం అవసరం ఉన్నా నేరుగా తనకు ఫోన్ చేయాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం తిరిగి సిరిసిల్ల వెళుతున్న మార్గ మధ్యలో రంగంపేట వద్ద చెట్లు నరుకుతున్న వారి పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనవసరంగా చెట్లు, కొమ్మలు నరకడం ఇక పై పునరావృతం కావద్దని, మొక్కలు నాటే సమయంలోనే విద్యుత్ వైర్లకు దూరంగా నాటాలని, విద్యుత్ తీగలు చెట్ల పైకి రాకుండా చూసుకుని మొక్కలు నాటాలని ఆదేశించారు.

# గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ నేతల నిరసన



(మొదటి పేజీ తరువాయి)

శాసనసభకు చీకటి రోజు అని ఆయన వ్యాఖ్యానించారు. దుర్మార్గమైన పద్ధతిలో నిన్న, మొన్న మా అక్కల్ని అవమానించారని.. ఇవాళ ఒక సభ్యుడు అమ్మ, అక్క అని తిడుతుంటే శాడిస్టు మాదిరిగా ముఖ్యమంత్రి పైశాచిక ఆనందం పొందుతూ అందర్నీ ఉసిగొల్పుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఒక శాడిస్టు ముఖ్యమంత్రిలా వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తప్పకుండా తెలంగాణ యువత తప్పకుండా రేవంత్ రెడ్డికి తగు రీతిలో సమాధానం చెబుతుందని హెచ్చరించారు.. ఎక్కువ రోజులు డ్రామా నడవదని స్పష్టం చేశారు.

ఈ ఐదారు రోజుల శాసన సభ సమావేశాల్లో ప్రభుత్వం తేలిపోయిందని కేటీఆర్ అన్నారు. గవర్నమెంట్‌లో విషయం లేదు.. కేవలం ఊదరగొట్టే ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఏమీ లేవని తేలిపోయిందని కాబట్టే ఈ బజారు భాషతో మమ్మల్ని రెచ్చగొడుతున్నారని తెలిపారు. మంచిగా మాట్లాడుతుంటే కావాలనే ఉసిగొల్పి ప్రజల దృష్టి మరల్చే ఒక చీప్ టాక్టిక్స్‌కు చేస్తున్నారని మండిపడ్డారు. ఈయన చీఫ్ మినిస్టర్ కాదు.. చీప్ మినిస్టర్ అని ఎద్దేవా చేశారు. ఒక శాడిస్టు ముఖ్యమంత్రిగా పైశాచిక ఆనందం పొందుతూ.. ఆడబిడ్డలను అవమానిస్తూ.. ఎమ్మెల్యేలను బూతులు తిట్టిస్తూ ఇష్టమొచ్చినట్టు ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని అన్నారు. అందుకే అసెంబ్లీలో నిరసన చెప్పి బయల్దేరి గన్‌పార్క్ వద్దకు వచ్చి.. మా శాసన సభ్యులు, మండలి సభ్యులు అందరం వచ్చి మా నిరసన చెబుతున్నామని పేర్కొన్నారు.

హైదరాబాద్ మీద కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెబుతుందని కేటీఆర్ మండిపడ్డారు. ఆ విషయంలో కూడా తప్పకుండా ప్రభుత్వాన్ని తూర్పార పడుదామని అనుకున్నామని చెప్పారు. కానీ బజారు భాషలో మాట్లాడేసరికి మా అక్క కోవ లక్ష్మీ దుఃఖం ఆపుకోలేక.. తమను బయటకు తీసుకొచ్చారని తెలిపారు. ఈ శాసనసభలో తెలంగాణ ప్రజలకు న్యాయం చేసే ముచ్చట్లు లేవని.. కేవలం కాంగ్రెస్ పార్టీ డ్రామాలు, కాంగ్రెస్ పార్టీ నాటకాలు తప్ప ఏమీ లేవని మండిపడ్డారు. అప్పులు, అప్పులు అని ఇన్ని రోజులు తప్పుడు కూతలు కూశారని చెప్పారు. అప్పులు లేవు.. ఈ రాష్ట్రం రెవెన్యూ సర్‌ప్లస్ స్టేట్ అని మేం ఎస్టాబ్లిష్ చేస్తే ఇవాళ నోరు మూసుకున్నారని తెలిపారు. అనేక విషయాలను డైవర్ట్ చేయడానికే మా అక్కల మీద నోరుపారేసుకుని.. కావాలని ప్రజల దృష్టి మరల్చే ఓ చిల్లర ప్రయత్నం చేస్తున్నాడు.. ఈ చిల్లర ముఖ్యమంత్రి అని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని గ్రహించాలని తెలంగాణ ప్రజలను విజ్ఞప్తి చేశారు.

**ఎమ్మెల్యేలను అరెస్టు చేసిన పోలీసులు**

ఆందోళనలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జాబ్ క్యాలెండర్ పేరిట నిరుద్యోగులను అసెంబ్లీ సాక్షిగా మోసం చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. ఈ క్రమంలో పోలీసులు, కేటీఆర్ మధ్య వాగ్వాదం నెలకొంది. అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలిపే హక్కు లేదా.. ఇదేనా ప్రజాపాలన అని ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోలీసులను ప్రశ్నించారు. వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వారిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. వారిని బస్సులో తరలించారు. కాగా బస్సులోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ ఆందోళన కొనసాగించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల ఉద్యోగాలిస్తామని ఆయన చెప్పారని.. రెండు ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని అన్నారు. రాహుల్ గాంధీ తెలంగాణకు రావాలని.. తెలంగాణ యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పకుండా రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చేదాకా కాంగ్రెస్ ప్రభుత్వం వెనుక బీఆర్ఎస్ పడుతుందని చెప్పారు. నిరుద్యోగులకు న్యాయం జరిగేదాకా తప్పకుండా వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు.

# నీట్ పరీక్ష రద్దు చేయాల్సిన అవసరం లేదు



- **సుప్రీంకోర్టు**

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ పరీక్షను రద్దు చేయమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వ్యవస్థాగత లోపాలు లేకపోవడమే ఇందుకు కారణమని తెలిపింది. అయితే ఇలాంటివి పునరావృతం కాకుండా ఎన్‌టీఏ లోపాలను సరిదిద్దుకోవాలని సూచించింది.

'నీట్ పేపర్ లీకేజీలో ఎలాంటి వ్యవస్థీకృత ఉల్లంఘనలు జరగలేదు. పరీక్ష పవిత్రతకు భంగం కలిగేలా విస్తృత స్థాయిలో లీక్ జరగలేదు. ప్రశ్నపత్రం లీకేజీ కేవలం ఝూర?ండ్‌లోని హజారీబాగ్, బిహార్‌లోని పట్నాకే పరిమితమైంది. దీనిపై దర్యాప్తు జరుగుతోంది. అందుకే మేము ఈ పరీక్షను రద్దు చేయం. అయితే, ఎన్‌టీఏలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయి. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశంలో ఇలాంటివి జరగడం సరికాదు. ఈ ఏడాదేలోనే సమ్యను పరిష్కరించాలి. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్‌టీఏదే అవుతుంది' అని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

**'రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలి'**

సుప్రీం కోర్ట్ 'నీట్ తీర్పు' సందర్భంగా – ఎన్‌టీఏ పనితీరు, పరీక్షల సంస్కరణల కోసం, ఇస్రో మాజీ ఛైర్మన్ కె రాధాకృష్ణన్ నేతృత్వంలో నియమించిన కమిటీకి పలు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్యానెల్‌ను మరింత విస్తరించాలని పేర్కొంది. పరీక్షా విధానంలోని లోపాలను సరిదిద్దడానికి అవసరమైన చర్యలపై కమిటీ సెప్టెంబరు 30లోగా నివేదికను అందజేయాలని ఆదేశించింది. పరీక్షా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అంతర్జాతీయ సాంకేతిక సంస్థల సాయం తీసుకోవాలని సూచనలు చేసింది. ఈ నివేదిక అందిన తర్వాత, అందులోని అంశాలను అమలుచేసే విధానంపై రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని, విద్యాశాఖను ధర్మాసనం ఆదేశించింది.

ఈ ఏడాది మే 5న నిర్వహించిన నీట్ ప్రవేశపరీక్ష దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో జరిగింది. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు రాశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి 67 మంది విద్యార్థులకు మొదటి ర్యాంకులు వచ్చాయి. హరియాణాలోని ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు తొలి ర్యాంక్ రావడం వల్ల పలు అనుమానాలు తలెత్తాయి. దీంతో పేపర్ లీకేజీ, ఇతర అక్రమాలపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు నీట్ యూజీ పరీక్షను మళ్లీ నిర్వహించాల్సిన అవసరం లేదని తీర్పు వెలువరించింది. మళ్లీ పరీక్ష పెడితే 24 లక్షల మంది ఇబ్బంది పడతారని కోర్టు అభిప్రాయపడింది.

# జాబ్ క్యాలెండర్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్షాళన చేశామన్నారు. వివిధ పరీక్షలకు నోటిఫికేషన్లు ఇచ్చినట్లు చెప్పారు. అభ్యర్థుల కోరిక మేరకు గ్రూప్–2 వాయిదా వేసినట్లు చెప్పారు. జాబ్ క్యాలెండర్‌ను నిన్న కేబినెట్ మీటింగ్‌లో ఆమోదించినట్లు చెప్పారు. జాబ్ క్యాలెండర్ 2024–25ని సభ్యులందరికీ అందించినట్లు తెలిపారు.

నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ ఇస్తామని భట్టి విక్రమార్క చెప్పారు. అక్టోబర్‌లో ట్రాన్స్‌కో, డిస్కమ్‌ల ఇంజినీరింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తామన్నారు. అక్టోబర్ నెలలో ఏఈఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఉంటుందని వెల్లడించారు.

## దుశ్శాసన సభగా మారిన
# తెలంగాణ శాసనసభ

(మొదటి పేజీ తరువాయి)

ఇదేనా నేర్పించేది అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ భాషను చూసి మన పిల్లలు ఏమనుకుంటారని ప్రశ్నించారు. తెలంగాణ శాసనసభ పరువు, ప్రతిష్టను మంటగలిపారని, తెలంగాణ శాసనసభ గౌరవాన్ని తలదించుకునేలా ఈ రోజు శాసనసభ నడుస్తుందని మండిపడ్డారు. ఇది చాలా దుర్మార్గమైన భాష అని అన్నారు. దీన్ని శాసనసభలో ఎంకరేజ్ చేస్తున్నారని మండిపడ్డారు. నిజంగా మేం ఆరకంగా చేసి ఉంటే ఇవాళ ఒక్క కాంగ్రెస్ సభ్యుడైనా మిగిలి ఉండేవాళ్లా? అని అడిగారు. మేం ఆరకంగా చేశామా? ఆ సంస్కృతిని మేం ఎంకరేజ్ చేశామా? అని ప్రశ్నించారు.

గతంలో ఇదే శాసనసభ్యుడు తెలంగాణ ఉద్యమం మీద మాట్లాడి నాలుక కరుచుకుని క్షమాపణ చెప్పారని హరీశ్‌రావు గుర్తుచేశారు. మళ్లీ ఈ రోజు అదే భాష మాట్లాడారని అన్నారు. భగవంతుడు ఉన్నారు.. ప్రజలు ఉన్నారని.. తప్పకుండా అతనికి తగిన శాస్తి జరుగుతుందని వ్యాఖ్యానించారు. ఆ శాస్తి జరిగే దాకా కూడా వదిలిపెట్టమని స్పష్టం చేశారు. ఆ శాసనసభ్యుడి మీద అనర్హత వేటు వేసేది ఖాయమని.. రేపు ఆయన మాజీగా మిగలడం తప్పదని అన్నారు.

# లైంగికదాడులు, సైబర్‌క్రైమ్‌పై ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి

- **బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

లైంగికదాడులు, సైబర్‌క్రైమ్‌పై ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. లైంగికదాడులు చేసిన వారికి త్వరగా శిక్ష పడాలని, బాధితులకు త్వరగా న్యాయం జరుగుతుందనే భరోసా ఇవ్వాలన్నారు.



శాసనసభలో సివిల్ కోర్టుల సవరణ బిల్లును మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశ పెట్టారు. సివిల్ కోర్టుల సవరణ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా కెటిఆర్ ప్రసంగించారు. సైబర్ క్రైమ్ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్‌క్రైమ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు త్వరగా భర్తీ చేయాలని, కేంద్ర చట్టాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం తన వైఖరి చెప్పాలని నిలదీశారు.

భావవ్యక్తీకరణ స్వేచ్ఛను హరించే చట్టాలు తీసుకరావడం మంచిది కాదని కెటిఆర్ హితువుపలికారు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ హరించేలా కొన్ని చట్టాలు వస్తున్నాయని, సభలో మా సభ్యులు ఎవరూ వీడియోలు తీయలేదని, అసెంబ్లీలోని కెమెరాలన్నీ స్పీకర్ ఆధీనంలోలో ఉంటాయన్నారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననం జరుగుతోందని, ప్రధాని నరేంద్ర మోడీ, సిఎంల వ్యక్తిత్వాన్ని కూడా కించపరిచేలా వీడియోలు వచ్చాయని, తెలంగాణకు లబ్ధి కలిగించే విషయాల్లో అందరూ కలిసి పని చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# సమన్వయంతోనే ప్రజాస్వామ్యం

- **సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి**
- **గవర్నర్లతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**
- **రెండు రోజుల సదస్సు ప్రారంభం**



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ప్రజాస్వామ్యం సజావుగా సాగడం చాలా కీలకమని, అందుకు గవర్నర్లు సమన్వయంతో పని చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్బోధించారు.. గత దశాబ్దంలో జరిగిన సామాజిక సంక్షేమ పథకాలు, న అభివృద్ధి గురించి ప్రజలకు అవగాహన కల్పించే రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. శుక్రవారం నాడిక్కడ రాష్ట్రపతి భవన్‌లో రెండు రోజుల గవర్నర్ల సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. కేంద్ర–రాష్ట్ర సంబంధాలను బలోపేతం చేయడమే కాకుండా సామాన్య ప్రజల సంక్షేమ పథకాలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తున్న అనేక అంశాలను ఈ సదస్సు చర్చించారు. జాతీయ విద్యా విధానంలో విద్యాసంస్థల అక్రిడిటేషన్, అసెస్‌మెంట్ వ్యవస్థను మెరుగుపరచడంపై దృష్టి సారించాలని కోరారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ల హౌదాలో గవర్నర్లు ఈ సంస్కరణ ప్రక్రియకు సహకరించాలని ఆమె కోరారు. నేర న్యాయానికి సంబంధించి ఎలాంటి చర్చ లేకుండా కేంద్ర ప్రభుత్వం అమలులో పెట్టిన మూడు కొత్త చట్టాలను ఆమె ప్రశంసించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో భూసారాన్ని పెంచి రైతుల ఆదాయాన్నిపెంచవచ్చని అన్నారు. రాజ్‌భవన్‌లు దీనిని ప్రోత్సహించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలగురించి ఆకాశాకెత్తేశారు. గిరిజన జనాభాలో ఎక్కువ భాగం షెడ్యూల్డ్, గిరిజన ప్రాంతాలలో నివసిస్తున్నారని, ఈ ప్రాంతాల ప్రజల సమగ్ర అభివృద్ధిని సాధించడానికి మార్గాలను సూచించాలని ఆమె గవర్నర్లను కోరారు. ఐక్యతా స్ఫూర్తిని మరింత బలోపేతం చేసేందుకు గవర్నర్లు సహకరించాలని అన్నారు. గవర్నర్లందరూ తమ ప్రమాణానికి న్యాయం చేస్తూ ప్రజల సేవకు, సంక్షేమానికి తమ వంతు సహకారం అందించాలని ఆమె కోరారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ, గవర్నర్లు కేంద్రం, రాష్ట్రాల మధ్య వారధిగా ఉండాలని అన్నారు. గవర్నరు పదవి రాజ్యాంగ పరిధిలోని రాష్ట్ర ప్రజల సంక్షేమంలో ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో కీలకపాత్ర పోషించగలదని అన్నారు. కేంద్ర హౌం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ప్రజల్లో విశ్వాసాన్ని నింపేందుకు, అభివృద్ధి పనులకు పూనుకోవడానికి గ్రామాలను, వెనుకబడిన జిల్లాలను సందర్శించాలని గవర్నర్లను కోరారు.

# తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిది

- **ఉపాధ్యాయుల సమస్యలు వినేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధమే**
- **ఎల్బీ స్టేడియంలో టీచర్లతో ముఖాముఖీలో సీఎం రేవంత్‌రెడ్డి**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని, వారే తమకు బ్రాండ్ అంబాసిడర్‌లని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో టీచర్లతో ఆయన ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. టీచర్లు తేనేటీగల లాంటి వాళ్లు అని, ఎవరి జోలికి వెళ్లరని, ఇక వాళ్ల జోలికి వెళితే ఏం జరుగుతుందో అందరికీ తెలుసని కీలక వ్యాఖ్యలు చేశారు. ఉద్యమ సమయంలో తెలంగాణ వస్తే విద్యావిధానం బాగుపడుతుందని ఆశిస్తున్నట్టు ఆయన తెలిపారు.

గత పదేళ్లలో ప్రొఫెసర్ కోదండరాం, హరగోపాల్, చుక్కా రామయ్య సహా అనేకమందికి సరైన గౌరవం దక్కలేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు వినేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధమేనని ఆయన అన్నారు. అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే 24వేల మంది పదోన్నతులు కల్పించినట్లు ఆయన తెలిపారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు హయాంలో టీచర్లకు చాలా గౌరవం ఉండేదని ఆయన గుర్తుచేశారు. పదేళ్లలో బిఆర్ఎస్ విద్యా వ్యవస్థను నాశనం చేసిందని ఆయన మండిపడ్డారు. గుంటూరు, పుణెలో చదివానని ఒకాయన అసెంబ్లీలో చెప్పారని, కానీ, తాను ప్రభుత్వ పాఠశాలలో చదివానని చెప్పుకునేందుకు గర్వపడుతున్నానని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ టీచర్లు చదువు చెబితేనే తాను ఈ స్థాయికి వచ్చానని ఆయన తెలిపారు. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రులు వారి భవిష్యత్‌ను మీ చేతుల్లో పెట్టారని సిఎం రేవంత్ అన్నారు. ఈ బడ్జెట్ లో విద్యకు 10శాతం కేటాయించాలని భావించామని, కానీ, హామీల అమలు దృష్ట్యా 7.3శాతం అంటే రూ.21వేల కోట్లకు పైగా కేటాయించామన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 30వేల పాఠశాలల్లో 26లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు.

10వేల ప్రైవేటు పాఠశాలల్లో 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, ప్రైవేటు పాఠశాలలల్లో మీకంటే గొప్ప టీచర్లున్నారా? మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఇందుకు కారణం కావచ్చు, తెలంగాణలో ఉద్యోగుల పరిస్థితి ఉమ్మడి రాష్ట్రంలో కంటే దారుణంగా ఉందని, ఇది కఠోర నిజమని సిఎం రేవంత్ అన్నారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు నమ్మకం కలిగించేందుకు ప్రతి నెల 1వ తేదీన జీతాలు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పదిహేనేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల పదోన్నతుల అంశాన్ని పరిష్కరించామన్నారు. మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. టీచర్లంతా 90శాతం పైగా నిబద్ధతతో పనిచేయాలని, విద్యార్థులకు విద్యనందించాలని, గతేడాదికంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 2లక్షలకుపైగా విద్యార్థుల అడ్మిషన్లు తగ్గాయని ఆయన తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవమని భావించేలా తీర్చిదిద్దాలని సిఎం రేవంత్ సూచించారు. ప్రభుత్వం వైపు నుంచి మీ సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు తమకు ఎలాంటి భేషజాలు లేవన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు స్వయం సహాయక మహిళా సంఘాలకు బాధ్యత అప్పగించామని సిఎం రేవంత్ తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మహిళలకు బాధ్యత అప్పగించామని, ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించామని ఆయన తెలిపారు. తెలంగాణ బలపడాలంటే మనందరం కార్యదీక్షతో పనిచేయాలన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాల్లో మినీ స్టేడియంల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. నైపుణ్యం లేకపోవడం వల్లే నిరుద్యోగం పెరుగుతోందని, అందుకే ముచ్చెర్లలో 50 ఎకరాల్లో రూ.150 కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసుకున్నామన్నారు. స్కిల్ యూనివర్సిటీలో యువకులకు నైపుణ్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్ పాలసీని తీసుకొస్తామని, మీరు నేర్పే విద్యనే రేపటి తెలంగాణ భవిష్యత్‌కు బాటలు వేస్తుందని, పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే మీ లక్ష్యం కావాలని సిఎం రేవంత్ సూచించారు.

# ఎస్సీ, ఎస్టీ నిధులను దారి మళ్లించారు

**కాగ్ నివేదిక విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో రెవెన్యూ రాబడి కన్నా రెవెన్యూ వ్యయంలో ఎక్కువగా ఉందని కాగ్ నివేదిక పేర్కొంది. సాగునీటి ప్రాజెక్టుల పైనే గత ఐదేళ్లలో ఎక్కువ ఖర్చులు చేశారని తెలిపింది. ఇవాళ 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాగ్ రిపోర్ట్ అసెంబ్లీలో ముందుకు వచ్చింది. మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టులకు భారీగా ఖర్చు చేసినట్టు పేర్కొంది. తీసుకున్న రుణాలు చెల్లించడానికే ఎక్కువ ఖర్చులు చేసినట్టు పేర్కొంది.

కార్పొరేషన్ల పేరుతో తీసుకున్న రుణాలను మళ్ళీ అప్పులు చెల్లించడానికి వినియోగించినట్టు తెలిపింది. గత ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిర్దేశించిన పరిమితి కన్నా 6శాతం ఎక్కువ రుణాలు తీసుకున్నదని తెలిపింది. గత సంవత్సరం బడ్జెట్ లో పన్నేతర రాబడి అంచనాలు ఎక్కువగా వేశారన్నారు. ఎస్సీ అభివృద్ధి నిధుల్లో 58శాతం, ఎస్టిలో నిధుల్లో 38శాతం వినియోగం కాలేదన్నారు. ఖర్చు అయిన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులను దారి మళ్లించారని కాగ్ నివేదిక లో వెల్లడైంది. 2021–22 ఆర్థిక ఏడాదితో పోల్చితే రాష్ట్ర జీఎస్డీపీ 2021–22తో పోలిస్తే 2022– 23లో 16 శాతం పెరిగిందని కాగ్ పేర్కొంది.

రెవెన్యూ రాబడులు గణనీయంగా 25 శాతం మేర పెరిగాయని తెలిపింది. సొంత పన్నుల రాబడి 17 శాతం పెరిగిందని తెలిపింది. సొంత రాబడి లేని సంస్థలకు ప్రభుత్వం రుణాలు ఏర్పాటు చేసిందని పేర్కొంది. 2022 –23 బడ్జెట్ వెలుపలి రుణాలు రూ.1,18,629 కోట్లుగా అంచనా వేసిందన్నారు. రాష్ట్రాభివృద్ధి రుణాలపై వడ్డీపై ఖర్చును తక్కువగా అంచనా వేశారని తెలిపింది. కేంద్రం నుంచి భారీగా గ్రాంట్లు వస్తాయని అంచనా వేశారని తెలిపింది. ఏపీ నుంచి తెలంగాణ విద్యుత్ కంపెనీలకు బకాయిలు వస్తాయని పేర్కొన్నా రాలేదని తెలిపింది. ఇండ్లు, గొర్రెల పంపిణీ, ఆయిల్ పామ్ పథకాల నిధులు కేటాయించినట్టు చూపించినా ఖర్చు కాలేదని వివరించింది.

ఎజెండాపై ప్రతిపక్ష పార్టీల అసంతృప్తి: శాసనసభ ఎజెండాను అర్ధరాత్రి ఇవ్వడం పట్ల ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఎజెండా ఒకటి ఇస్తున్నారని, సభలో మరొక దానిపై చర్చ నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ప్రస్తావించారు. ఒక్క పొలిటికల్ పార్టీ కోరికల మీద, ఇష్టం మీద అసెంబ్లీ నడవకూడదని, అందరిని పరిగణలోకి తీసుకోవాలని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ప్రభుత్వానికి సూచించారు. ప్రతి రోజు మాకు ఎజెండా ఒంటి గంటకు వస్తుంది..మొన్న మాత్రం 1:40 గంటలకు వచ్చింది. అప్పుడు వస్తే సబ్జెక్ట్ మీద మేం ఎప్పుడు ప్రిపేర్ కావాలి. 25 ఏండ్ల నా అనుభవంలో ఇలా సభ జరగడం నేను ఎప్పుడు చూడలేదని అక్బరుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు.

## ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల కష్టాలకు చెక్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రయాణికుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిలో మూసీ నది బ్రిడ్జి టేకుమట్ల గ్రామం దాటిన తర్వాత ఖమ్మంకు కొత్త రోడ్డు నిర్మాణం జరిగిన విషయం తెలిసిందే. అయితే, ఖమ్మం నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలు సూర్యాపేట వైపు రాయినిగూడ గ్రామ సమీపానికి సుమారు 2కిలోమీటర్స్ వెళ్లి యూటర్న్ తీసుకోవాల్సి వస్తున్నది. ఇది వాహనదారులకు ఇబ్బందిగా మారింది. పలు ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి.

ఇక్కడ నెలకొన్న ప్రమాదకర పరిస్థితి గురించి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు స్వయంగా కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. ఎంపీ రవిచంద్ర విజ్ఞప్తులను పరిశీలించి గడ్కరీ సానుకూలంగా స్పందిస్తూ ఫ్లైఓవర్ మంజూరు చేశారు. దీని నిర్మాణపు పనులను నేషనల్ హైవేస్ అథారిటీ త్వరలో చేపట్టనుంది. తన విజ్ఞప్తి మేరకు ప్రయాణికుల కష్టాలను కడతేర్చేందుకు ఫ్లైఓవర్ మంజూరు చేయడం పట్ల ఎంపీ వద్దిరాజు హర్షం వ్యక్తం చేస్తూ కేంద్ర మంత్రి గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు.

## రేవంత్ నీ సీఎం పదవి పోయే ఛాన్స్

- **ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద కౌశిక్‌రెడ్డి మాట్లాడారు. శాసన సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అవమానించారని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. క్షమాపణలు చెప్పమంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై ఎదురుదాడికి దిగారని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న తమపై ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సిఎం రేవంత్ పలుమార్లు బిఆర్ఎస్ ఎంఎల్ఎల సభ్యత్వాలు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని, రేవంత్ రెడ్డి అమెరికాకు వెళ్లిన తరువాత ఆయన సభ్యత్వం రద్దయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఖమ్మం లేదా నల్లగొండ నేతలు రేవంత్ పదవిని లాక్కునే అవకాశం ఉందని, చిట్‌చాట్‌లో కొందరు మంత్రులు ఇదే విషయాన్ని చెబుతున్నారని ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవిని కాపాడుకోవాలని కౌశిక్ రెడ్డి చురకలంటించారు.

# ఉత్కంఠ మ్యాచ్.... చివరికి టై

- భారత్, శ్రీలంక తొలి వన్డే టై
- రోహిత్ శర్మ అర్ధ సెంచరీ

**బలగం టీవీ, కొలంబో**

భారత్-శ్రీలంక మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ శుక్రవారం ప్రారంభం అయింది. తొలి మ్యాచ్ లో శ్రీలంక బౌలర్ల అద్భుత ప్రదర్శనతో మ్యాచ్ టైగా ముగిసింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 230 పరుగులు చేసింది. తర్వాత శ్రీలంక బౌలర్లు అద్భుత ప్రదర్శన చేసి భారత్‌ను 230 పరుగులకే పరిమితం చేశారు. దాంతో మ్యాచ్ టైగా ముగిసింది.



స్వల్ప ఛేదనలో కెప్టెన్ రోహిత్ శర్మ(58) హాఫ్ సెంచరీతో కదం తొక్కగా.. కేఎల్ రాహుల్(31, అక్షర్ పటేల్(33)లు సాధికారక ఇన్నింగ్స్ ఆడారు. ఆఖర్లో శివం దూబే(25) తన స్టయిల్లో చెలరేగాడు. విజయానికి ఒక్క పరుగు అవసరమైన వేళ చరిత అలసంక(3/30) మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వరుస బంతుల్లో దూబె, అర్ష్‌దీప్ సింగ్(0)లను ఎల్బీగా వెనక్కి పంపాడు. అంతే మమ్యాచ్ టైగా ముగిసింది.

లంక నిర్దేశించిన స్వల్ప ఛేదనను ఓపెనర్ రోహిత్ శర్మ(58) ధాటిగా ఆరంభించాడు. అరంగేట్ర పేసర్ మహ్మద్ షిరాజ్, స్పిన్నర్ దునిత్ వెల్లలాగే బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. మూడో ఓవర్ తొలి బంతికే ఎల్బీగా ఔటయ్యే ప్రమాదం తప్పించుకున్న రోహిత్ మరింత రెచ్చిపోయాడు. 33 బంతుల్లోనే అర్ధ శతకం బాదడంతో టీమిండియా పవర్ల ప్లేలో వికెట్ కోల్పోకుండా 71 రన్స్ చేసింది. టీమిండియా స్కోర్ బుల్లెట్టులా ఉరికింది.



భారత ఇన్నింగ్స్ జోరుగా సాగుతున్న వేళ దునిత్ వెల్లలాగే లంకకు తొలి బ్రేక్ ఇచ్చాడు. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్(16)ను ఎల్బీగా ఔట్ చేసి ఈ జోడీని విడదీశాడు. ఆ తర్వాత విరాట్ కోహ్లీ(24), శ్రేయస్ అయ్యర్(23)లు విఫలమయ్యారు. 132కే ఐదు వికెట్లు పడిన జట్టును కేఎల్ రాహుల్(31), అక్షర్ పటేల్(33)లు ఆదుకున్నారు. వీళ్లిద్దరూ లంక స్పిన్నర్లు సమర్థంగా ఎదుర్కొంటూ ఇన్నింగ్స్ నిర్మించారు. ఐదో వికెట్‌కు 57 పరుగులు జోడించి జట్టును గెలుపు బాట పట్టించారు.

టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణయం ఆ జట్టుకు బిగ్ షాకిచ్చిందనే చెప్పాలి. భారత బౌలర్లు వరుసగా వికెట్లు తీసుకోవడంతో ఆ జట్టు కష్టాల్లో పడింది. అయితే, పాతుమ్ నిస్సంక (56 పరుగులు), లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ దునిత్ వెల్లలాగే అజేయంగా 67 పరుగుల ఇన్నింగ్స్ ఆడటంతో శ్రీలంక జట్టు గౌరవప్రదమైన స్కోరును అందుకోగలిగింది.



# సెమీస్‌కు లక్ష్యసేన్..

**బలగం టీవీ, పారిస్**

పారిస్ ఒలింపిక్స్‌లో భారత యువ షట్లర్ లక్ష్యసేన్ చరిత్ర సృష్టించాడు. విశ్వ క్రీడల్లో సెమీ ఫైనల్లో అడుగుపెట్టిన భారత తొలి పురుష షట్లర్‌గా రికార్డు నెలకొల్పాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో చైనీస్ తైపీకి చెందిన చౌ థియెన్ చెన్‌పై లక్ష్య సేన్ గెలుపొంది. హెూరాహెూరీగా సాగిన మ్యాచ్‌లో 19-22, 21-15, 21-12తో చెన్‌కు భారత కెరటం చెక్ పెట్టాడు. 16వ రౌండ్ మ్యాచ్‌లో భారత్‌కే చెందిన హెచ్‌హెస్ ప్రణయ్ పై గెలుపొందిన లక్ష్యసేన్ క్వార్టర్స్‌లోనూ గర్జించాడు. తొలి సెట్‌లో వెనకబడిన భారత కెరటం.. రెండో సెట్‌లో పంజా విసిరాడు. 21-15తో చెన్‌పై ఆధిపత్యం చెలాయించాడు.

# ఆర్చరీలో పతకం మిస్ ...



**బలగం టీవీ, పారిస్**

పారిస్ ఒలింపిక్స్‌లో మరో పతకం భారత్ చేజారింది. ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్య పతకం కోసం జరిగిన మ్యాచ్‌లో భారత జోడీ ఓటమి పాలైంది. సెమీఫైనల్లో దక్షిణ కొరియాతో తలపడిన ధీరజ్-అంకిత జోడీ 6-2 పాయింట్ల తేడాతో ఓడి... కాంస్య పతకం కోసం అమెరికాతో పోటీ పడింది. అయితే, ఈ పోటీలో అమెరికా జోడీ బ్రాడీ ఎలిసన్ - కేసీ కౌఫోల్డ్ తొలి సెట్ నుంచే ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. దీంతో ధీరజ్-అంకిత జోడీ అమెరికా చేతిలో 6-2 పాయింట్ల తేడాతో పతకాన్ని కోల్పోయింది.

# హాకీలో ఆస్ట్రేలియాపై భారత్ విజయం

- క్వార్టర్ ఫైనల్‌కు టీమిండియా

**బలగం టీవీ, పారిస్**

పారిస్ ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సంచలన ఆటతో బలమైన ఆస్ట్రేలియా పై రికార్డు విజయంతో క్వార్టర్స్ బెర్తు సాధించింది. ఆద్యంతం ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో 3-2తో కంగారులకు భారత్ చెక్ పెట్టింది. తద్వారా 52 ఏండ్ల తర్వాత ఒలింపిక్స్‌లో ఆసీస్‌పై తొలి విజయం నమోదు చేసింది. 1972 తర్వాత ఆస్ట్రేలియపై ఇదే మొదటి గెలుపు కావడం గమనార్హం. ఆసీస్‌పై కీలక విజయంతో గ్రూప్ బిలో భారత్ రెండో స్థానంలో నిలిచి క్వార్టర్స్‌లో అడుగు పెట్టింది.



# దేవర సెకండ్ సాంగ్ రిలీజ్ అప్డేట్

**బలగం టీవీ, హైదరాబాద్**


ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం రెండు పార్ట్‌లుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి పార్ట్‌కు సంబంధించి శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమా సెకండ్ సింగిల్‌ను ఆగస్ట్ 5న విడుదల చేయబోతున్నట్లుగా మేకర్స్ ఓ పోస్టర్ వదిలారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ సినిమాలో మరో బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించి ఇటీవల రిలీజ్ డేట్‌ను ఫైనల్‌గా ఫైనల్ చేశారు. సెప్టెంబర్ 27న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో.. ఎంటైర్ ఇండియాలోని సినీ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ పాన్ ఇండియా భారీ చిత్రాన్ని విడుదల చేయటానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లుగా అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే.




# విజయ్ ఫస్ట్ లుక్ రిలీజ్..

**బలగం టీవీ, హైదరాబాద్**

గౌతమ్ తిన్ననూరి - విజయ్ దేవరకొండ కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపొందుతుంది. తాజాగా, ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌తో సినిమా విడుదల తేదీని ప్రకటించారు. ఈ మూవీని వచ్చే ఏడాది మార్చి 28న విడుదల చేయనున్నట్టు వెల్లడించారు. ఇక ఈ నెలలోనే మూవీ టైటిల్ కూడా రివీల్ చేయనున్నట్టు తెలిపారు మేకర్స్. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.



## హైకోర్టుకు రాజ్‌తరుణ్

**బలగం టీవీ, హైదరాబాద్**

హీరో రాజ్‌తరుణ్ గురువారం హైకోర్టును ఆశ్రయించారు. తనను ప్రేమించి మోసం చేశాడని లావణ్య ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు రాజ్‌తరుణ్ పై కేసు నమోదు చేశారు. ఈ కేసులో విచారణకు రావాలంటూ ఆయనకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. సినిమా షూటింగ్స్ వల్ల రాలేకపోతున్నానంటూ రాజ్‌తరుణ్ కొంత సమయం అడిగిన విషయం తెలిసిందే. తాజాగా లావణ్య పెట్టిన కేసుకు సంబంధించి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో రాజ్ తరుణ్ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ అనంతరం నార్సింగ్ పోలీసుల ఆదేశాలు తీసుకున్న తర్వాత పరిశీలిస్తామని కోర్టు తెలుపుతూ తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.